క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు


పూజలందుకున్న శ్రీ రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మంగళ హారతితో ప్రారంభమై గోపీగీత, భగవద్గీత 12వ అధ్యాయం, శిక్షాష్టకం పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

అంతర్జాతీయ పోటీల్లో వెల్లంకి విద్యార్థి ప్రతిభ


పతకాలు, మెమెంటోతో దినేష్

ఆనందపురం : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన గొలగాని దినేష్ చైనాలో నిర్వహించిన అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ ఫెయిర్స్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ నెల 23 నుంచి 28 వరకు నిర్వహించిన పోటీల్లో పది దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా అందులో దినేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. గత ఎనిమిదేళ్లుగా దినేష్ రోలర్ స్కేటింగ్ క్రీడలో తర్ఫీదు పొందుతూ పలు పతకాలు సాధించాడు. జాతీయ స్థాయి పోటీల్లో ఐదు బంగారు పతకాలు, జిల్లా స్థాయి పోటీల్లో 50 వరకు వివిధ రకాల పతకాలు సాధించాడు. దినేష్ మధురవాడలోని విజయం పాఠశాలలో చదువుతున్నాడు. ఈ మేరకు దినేష్‌ను ఇండియా కోచ్ సత్యం, ఏపీ కోచ్ చిట్టిబాబు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, గ్రామస్తులు అభినందించారు.

ఎండాడ కూడలికి న్యూలుక్


జాతీయ రహదారిపై ఎండాడ కూడలిలో ఏర్పాటు చేసిన కళాకృతులు

కొమ్మాది: విశాఖ ఎప్పటికప్పుడు నూతన శోభను సంతరించుకుంటోంది. ఇప్పటికే సుందరీకరణలో భాగంగా విశాఖ బీచ్ రోడ్డు నుంచి భీమిలి బీచ్ రోడ్డు వరకు అనేక చోట్ల విద్యుత్ దీపాలంకరణ, రోడ్లు, పెయింటింగ్స్, కల్వర్టులు నిర్మించారు. ఈ క్రమంలో ఎండాడ జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన రెండు కళాకృతులు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులోని కొబ్బరి చెట్ల పార్కు వద్ద సోమవారం ఒక గుర్తి తెలియని వ్యక్తి చనిపోయాడు. కాలిన గాయాలతో కొన ఊపిరితో ఉండగా కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లగా తీవ్ర గాయాలతో ఉన్న వ్యక్తి కొద్ది సేపు ఒడియా భాషలో మాట్లాడి చనిపోయాడు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సీఐ రమేష్ మాట్లాడుతూ మృతుని శరీరంపై కాలిన గాయలతోపాటు, చేతికి సెలైన్ ఎక్కించిన ఆనవాళ్లు ఉన్నాయని... ఎక్కడో ఆస్పత్రిలో చికిత్స పొందినట్టు తెలుస్తోందని తెలిపారు. ఇక్కడకు ఎలా వచ్చాడో తెలియడం లేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నామని, కుటుంబీకులు ఎవరైనా గుర్తిస్తే పోలీసులను సంప్రదించాలని కోరారు.

పేదలందరికీ కార్పొరేట్ వైద్యం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


సంతపేట శిబిరంలో లబ్ధిదారులకు మందులు అందిస్తున్న జెడ్సీ రాము


మారికవలసలో వైద్య శిబిరంలో సత్కరించిన వైద్యులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు, ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆర్‌జీకే కాలనీలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి, ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పింపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకూ ఇళ్ల వద్దనే అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాల్లో మెరుగైన సేవలు అందిస్తున్న వైద్యులను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, జెడ్సీ కనక మహాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో 'సురక్ష' శిబిరం సక్సెస్

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు ఆదర్శనగర్ – 1 వార్డు సచివాలయం పరిధి సంతపేట చిల్డ్రన్స్ పార్కులో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సక్సెస్ అయింది. ఈ శిబిరాన్ని భీమిలి జెడ్సీ బి.రాము ప్రారంభించి లబ్ధిదారులకు మందులు, కేస్ షీట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందన్నారు. శిబిరంలో వైద్యులు సందీప్, పూర్ణిమ, సుష్మిత, ప్రవీణ్‌వర్మ, కిషోర్ కాంతి, సిబ్బంది ఎచ్చెర్ల హరి సేవలు అందించారు. వీరికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, అధ్యక్షుడు చిల్ల భాస్కర రెడ్డి, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పల రెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు నమ్మి లక్ష్మణ సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, జగన్నాథ ఎల్లాజీ, చిల్ల ప్రమీల, కృష్ణవేణి, మద్ది మహాలక్ష్మి, నీలాపు సురేష్ రెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, జీరు పద్మ తదితరులు పాల్గొన్నారు.

'సురక్ష' శిబిరం నేడు

తగరపువలస: జీవీఎంసీ 1వ వార్డు బాలాజీనగర్ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహిస్తామని జెడ్సీ బి.రాము తెలిపారు. ఈ శిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు బాలాజీనగర్ సచివాలయం ఆవరణలో జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సచివాలయ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యూపీహెచ్‌సీలో 518 మందికి వైద్య పరీక్షలు

పీఎం పాలెం : పీఎం పాలెం యూపీహెచ్‌సీలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సందర్శించారు. వైద్య పరీక్షలు, మందుల సరఫరా వివరాలను ఎమ్మెల్యేకు స్థానిక వైద్యాధికారి సుజాన్ పల్లా తెలియజేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన కిట్లు అందజేశారు. అనంతరం శిబిరంలో పాల్గొన్న వైద్యులను ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ మధురవాడ జోన్ జెడ్సీ కనకమహాలక్ష్మి, 6, 7 వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు గాదె రోశిరెడ్డి, పోతిన ప్రసాదు, కె.వరలక్ష్మి, ఎల్లాజీ, జామి శివకుమార్, పిళ్ల సూరిబాబు, పోతిన సూరిబాబు పాల్గొన్నారు.


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


పీఎం పాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారి సుజాన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు


శిబిరంలో పేర్లు నమోదు చేస్తున్న సిబ్బంది


మారికవలసలో రిజిస్ట్రేషన్ల వద్ద రోగులు

సాగుదారులకు పట్టాలిచ్చేందుకు చర్యలు


జాబితా పరిశీలిస్తున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మాధురి, తహసీల్దార్ వేణుగోపాల్

పద్మనాభం: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములకు రైతుల పేరున పట్టాలు ఇవ్వనున్నట్టు ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మాధురి అన్నారు. మండలంలోని చిన్నాపురంలో సోమవారం ఆయా భూములకు సంబంధించి రైతుల నుంచి స్వీకరించిన ముటేషన్లపై నిర్వహించిన గ్రామ సభను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాధురి మాట్లాడుతూ ఇంత వరకు 87 మంది పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. తహసీల్దార్ కె.వేణుగోపాల్ మాట్లాడుతూ చిన్నాపురంలో 110 కుటుంబాలు 50 ఏళ్ల నుంచి 73 ఎకరాలు సాగు చేసుకుంటున్నాయన్నారు. వీరికి ఇంత వరకు యా భూములకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచనల మేరకు కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాలతో నవంబర్ 4న సాగుదారులకు పట్టాలిస్తామన్నారు. ఆయా భూములకు సంబంధించి సాగుదారులు ఇంకా ఎవరైనా ఉంటే పట్టాల కోసం ముటేషన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం సాగుదారుల జాబితా ప్రకటించారు. వీఆర్వో సుమలత పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ నిమజ్జనం అడ్డగింత


టి.నగరపాలెం వద్ద ఏర్పాటు చేసిన స్నానాల ఘాట్

తగరపువలస: చిట్టివలస కార్మికవాడ నుంచి భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గోస్తనీ తీరంలో ఆదివారం రాత్రి 12 గంటల సమయంలో నిమజ్జనానికి తీసుకొచ్చిన దుర్గమ్మ విగ్రహాన్ని జనసేన కార్యకర్త నానాజీ అడ్డుకున్నాడు. బలవంతంగా వెనక్కు పంపేయండతో నిర్వాహకులు చేసేదిలేక తీసుకెళ్లి డ్రైనేజీ మురుగునీరు నదిలో కలిసే చోట నిమజ్జనం చేసుకోవాల్సి వచ్చింది. ఈ నెల 25న కూడా అమ్మవారి విగ్రహాలను నదిలో నిమజ్జనం చేయకుండా నానాజీ అడ్డుకున్నట్టు నిర్వాహకులు వాపోయారు. ఏ అధికారంతో విగ్రహాలను అడ్డుకుంటున్నాడోనని వారు వాపోతున్నారు. జనసేన కార్యకర్త నానాజీ పెత్తనం చెలాయిస్తుండటంతో టి.నగరపాలెం పంచాయతీ పాలకవర్గం సైతం విస్తుపోతోంది. పంచాయితీలో జీవీఎంసీ పంప్‌హౌస్ వద్ద గతంలో దివీస్ లేబొరేటరీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్నానాల ఘాట్ నిర్మించి నిర్వహణను పంచాయతీకి అప్పగించింది. పాత వంతెన తర్వాత నదిలో డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతాలకు చెందిన వారు టి.నగరపాలెం స్నానాల ఘాట్‌కు వచ్చి పవిత్ర స్నానాలు, వినాయకుడు, దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం, పూజా సామాగ్రి గంగలో కలపడం చేస్తుంటారు. వినాయక చవితి వరకు నిరాటంకంగా సాగిన ఈ కార్యక్రమాలు జనసేన కార్యకర్త నానాజీ చర్యలతో ప్రస్తుతం నిలిచిపోయాయి.

ఢిల్లీకి డిగ్రీ కళాశాల విద్యార్థులు


ఢిల్లీలో డిగ్రీ కళాశాల విద్యార్థులు

భీమునిపట్నం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు 'నా మట్టి – నా దేశం' కార్యక్రమంలో పాల్గొనడానికి సోమవారం ఢిల్లీ వెళ్లారు. వీరు 31 వరకు జరిగే జాతీయ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ 'నా మట్టి – నా దేశం' కార్యక్రమంలో పాల్గొనడానికి కళాశాల నుంచి 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా కలశాల్లో సేకరించిన మట్టిని అక్కడ అందిస్తారని తెలిపారు. అధ్యాపకులు జి.మహేశ్వరరావు, వై.వెంకటరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

రోడ్లు నిర్మించాలని 'స్పందన'లో వినతి

మధురవాడ : జీవీఎంసీ జోన్ – 2 పరిధిలో కాల్వలు, గెడ్డలు పరిరక్షించి, రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. ఈ మేరకు సోమవారం మధురవాడ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఈఈ శాంతిరాజు వినతులు స్వీకరించారు. జీవీఎంసీ 6వ వార్డు అన్నంరాజు నగర్‌లో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని కాలనీవాసి అమ్మినాయుడు వాపోయారు. జీవీఎంసీ 8వ వార్డులో కాల్వ నీరు గెడ్డలో కలుస్తున్న చోట రోడ్డు కోతకు గురవుతోందని, రక్షణ చర్యలు చేపట్టాలని, ఇక్కడ బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జి.వెంకటరమణ కోరారు. నగరంపాలెం ముత్యాలమ్మ గుడి సమీపంలో వీధి లైట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని జిల్లా కోర్టు రిటైర్డ్ సూపరింటెండెంట్ జి.తవిటి నాయుడు కోరారు. బొట్టవానిపాలెం చెరువు, నగరంపాలెంలో డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, వీధిలైట్ల కోసం కె.స్వప్న వినతిపత్రం ఇచ్చారు. క్రికెట్ స్టేడియం ఎదురుగా గల సూర్యశక్తినగర్, మానం ఆంజనేయులు నగర్, వుడా కాలనీల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలని టి.చంద్రనాగు, దుక్క.సూరిబాబు, శ్రీధర్ కోరారు. మొత్తంగా 12 అర్జీలు వచ్చాయి. వీటి పరిష్కారానికి చర్యలు చేపడతామని శాంతిరాజు తెలిపారు.

భీమునిపట్నం: జోనల్ కార్యాలయంలో జెడ్సీ బొడ్డేపల్లి రాము ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు రెండు వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ విభాగానికి ఒక్కో వినతి వచ్చింది. వీటిని పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

సీఎం జగన్ పాలనలో అందరికీ న్యాయం


పాలవలసలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రజలందరికీ సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాలవలసలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య ఎక్కడున్నా రాజకీయాలకు అతీతంగా పరిష్కరించడానికే సీఎం జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. గతంలో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సమస్యలను పరిష్కరించేవారని, ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ఒక ఇంటినే యూనిట్‌గా తీసుకుని సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ప్రజల కోసం నిరంతరం పనిచేసే ఇలాంటి యంత్రాంగం లేదన్నారు. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి అర్హతనే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందించడం గొప్ప విషయమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన పథకాలే కాకుండా జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష, చేయూత వంటి కార్యక్రమాలను అమలు జరిపి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందరి మన్ననలు అందుకుంటున్నారని చెప్పారు. టీడీపీ పాలనలో అన్నీ కుంభకోణాలేనని, వారి పార్టీ వారికే పథకాలు అందించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు.

అవినీతి లేకుండా పథకాల అమలు

సీఎం వైఎస్ జగన్ పాలనలో లంచాలు లేకుండా, అవినీతి లేకుండా సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రతీ రూపాయి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. ప్రజల కష్టాలను తీర్చడానికి నిరంతరం శ్రమించే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేసుకోవాల్సిన చారిత్రాత్మక అవసరం ఎంతో ఉందని, మరలా ఆయనను ప్రజలు ఆశీర్వదించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. పాలవలస పంచాయతీలో వివిధ సంక్షేమ పథకాల కింద ప్రజలకు రూ.19 కోట్లు అందించగా, అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాలను భీమిలి సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి లక్ష మంది ఫాలోవర్స్‌కి చేరిన సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు రౌతు శ్యామల, నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, రౌతు వెంకటరావు, నాగోతు నరిశమ్మ, కోరాడ అప్పలస్వామి నాయుడు, బీఆర్‌బీ నాయుడు, రౌతు శ్రీను, బొట్టా రామకృష్ణ, నాగోతు మహేష్, లెంక రాంబాబు, కోరాడ వెంకట రమణారావు, డోల దేముడు తదితరులు పాల్గొన్నారు.

పశుమాంస వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..


గోస్తనీ నది వద్ద పరిశీలిస్తున్న జెడ్సీ రాము

తగరపువలస: బహిరంగ ప్రదేశాల్లో పశుమాంస వ్యర్థాలు పడేస్తున్న వ్యాపారులను గుర్తించి వారిపై భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేయాలని జెడ్సీ బి.రాము శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులను సోమవారం ఆదేశించారు. 'ఎక్కడపడితే అక్కడే మాంసం వ్యర్థాలు' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. బంగ్లామెట్ట, పాత మేకల కబేళా ప్రాంతంలో పర్యటించి పరిశీలించారు. జీవీఎంసీ పరిధిలో ఎక్కడా బహిరంగంగా మాంసం వ్యర్థాలు వేయడానికి వీలు లేదన్నారు. నివాసాలకు దూరంగా వాటిని పూడ్చిపెట్టి పర్యావరణానికి విఘాతం లేకుండా చూడాలన్నారు. అలాగే బంగ్లామెట్ట పరిసర ప్రాంతాల్లో గోస్తనీనది తీరంలో బహిరంగ మలవిసర్జనకు వెళ్తున్నవారిని ప్రశ్నించారు. బహిరంగ మలవిసర్జన చేసేవారిని గుర్తించి రూ.100 నుంచి రూ.500 వరకు జరిమానా విధించాలని ఆదేశించారు. ఆయనతోపాటు ఏఎంవో శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, శానిటరీ కార్యదర్శులు అఖిల్, శివ, మనోజ్, సురేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

జ్యూట్ కార్మికులకు బకాయిలు చెల్లించాలి

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు కార్మికులకు యాజమాన్యం వెంటనే బకాయిలు చెల్లించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గుజ్జు రామునాయుడు భవన్‌లో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. పీఎఫ్, గ్రాట్యుటీ, నష్ట పరిహారం అందని కార్మికులు ఆందోళనలో ఉన్నారన్నారు. మూడేళ్లుగా యాజమాన్యానికి కార్మికులు దరఖాస్తులు చేసుకుంటున్నా చిన్నచిన్న కారణాలు చూపుతూ యాజమాన్యం రిజెక్ట్ చేస్తుందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులకు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో కొండపు ఈశ్వరరావు, దల్లి అప్పల రెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, వేమల అప్పల రెడ్డి, చిల్ల ఆదినారాయణరెడ్డి, బోర రామారావు, నరవ రామారావు, కానూరి రాంబాబు, చిల్ల రాంపైడి, మావూరి వీర్రాజు, బోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

పద్మనాభం: రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ జంగం జోషి, గ్రామీణ వైద్యుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి సూచించారు. మండలంలోని కోరాడలో సోమవారం క్రిస్టియన్ వెల్ఫేర్ క్లబ్, కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రొమ్ముపై గడ్డలు ఏర్పడడం, ఆగిన తర్వాత మళ్లీ మళ్లీ రుతుస్రావం జరిగితే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్ బాధితులకు కారుణ్య క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరావు, సీడబ్ల్యూసీ అధ్యక్షుడు కె.పద్మకుమార్, కార్యదర్శి ఎస్.వి.పి.డి. ప్రభాకర్ కోశాధికారి అబ్రహం, దున్న అబ్రహం పాల్గొన్నారు.

టెక్నీషియన్ అదృశ్యం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న బీతి రాంబాబు (37) ఈ నెల 23న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. భార్య సురేఖ, ఇద్దరు పిల్లలతో తగరపువలస జోగావారి వీధిలో రాంబాబు ఉంటున్నాడు. ఈ మేరకు సురేఖ ఆదివారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. 23న ఉదయం 7 గంటలకు నిద్ర నుంచి లేచి చూడగా తన భర్త కనపించలేదని, అప్పటి నుంచి తెలిసిన వారిళ్లు, బంధువుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ తెలియలేదన్నారు. ఆమె ఫిర్యాదుతో భీమిలి హెడ్ కానిస్టేబుల్ జి.సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి సేవా సమితి సహకారంతో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 163 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లద్దాలు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.సింహాచలం, సత్యసాయి సమితి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడి మహిళ మృతి

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతపేట గొల్లవీధికి చెందిన ఎనుకోటి విజయలక్ష్మి (62) సోమవారం ఉదయం ప్రమాదవశాత్తూ కుమ్మరవీధిలోని పాడుబడిన బావిలో పడి మృతి చెందారు. విషయం తెలుసుకున్న తాళ్లవలస అగ్నిమాపకశాకాధికారి శ్రీనివాసరావు సిబ్బందితో బావి వద్దకు చేరుకున్నారు. 30 అడుగుల లోతైన బావిలోకి అగ్నిమాపక, భీమిలి పోలీస్ సిబ్బంది కలిసి వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు నీలాపు సురేష్‌రెడ్డిని దించి విజయలక్ష్మి మృతదేహాన్ని బయటకు తీశారు. ఆమె మానసికస్థితి సరిగా లేదని, అందుకే ప్రమాదానికి గురై ఉంటుందని స్థానికులు తెలిపారు.

జీఎస్‌టీ అధికారుల తనిఖీలు


తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అధికారులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతబయలు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఉప్పల మంగరాజుకు చెందిన వ్యాపార సంస్థలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన సోదరుడు ఉప్పల రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు వీరు వచ్చినట్టు తెలిసింది. సంతబయలు ప్రాంతంలో ఉప్పల చిన వెంకటరమణకు 15వ నంబరు రేషన్ డిపో ఉంది. ఈ డిపో ఉన్న షాపు తనదని కొంతకాలంగా తండ్రి చిన వెంకటరమణ, తమ్ముడు మంగరాజుతో రమేష్‌బాబు న్యాయపోరాటం చేస్తున్నాడు. దీనిపై పలుమార్లు పౌరసరఫరాల శాఖ అధికారులు, భీమిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నాడు. ఇటీవల తన తమ్ముడు అగ్గిపెట్టెల వ్యాపారంతోపాటు అక్రమంగా గుట్కా వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపిస్తూ సెంట్రల్, స్టేట్ జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఈ నెల 18న సెంట్రల్ జీఎస్టీ అధికారులు, సోమవారం స్టేట్ జీఎస్టీ అధికారులు మంగరాజు గిడ్డంగిని పరిశీలించి అగ్గిపెట్టెలు మాత్రమే ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. దీనిపై మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.